యమాల్ కమాల్..

ఫ్రాన్స్‌కు షాకిచ్చిన స్పెయిన్

12 ఏండ్ల తర్వాత యూరో కప్ ఫైనల్‌కు

మునిచ్: యూరో కప్‌లో టైటిల్ ఫేవరేట్లుగా ఉన్న ఫ్రాన్స్‌కు తొలి సెమీస్‌లో స్పెయిన్ ఊహించని షాకిచ్చింది. టోర్నీ ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శనతో అసలు ఓటమన్నదే లేకుండా సెమీస్ చేరిన స్పెయిన్.. 2-1తో ఫ్రాన్స్‌ను చిత్తుచేసి 12 ఏండ్ల (2012లో చివరిసారి) తర్వాత యూరో కప్ ఫైనల్‌కు చేరింది. ఆట మొదలయ్యాక 9వ నిమిషంలోనే ఫ్రాన్స్ కోలో ముువానీ తొలి గోల్ కొట్టి ఆ జట్టును ఆధిక్యంలోకి తెచ్చాడు. కానీ స్పెయిన్ తరపున 16 ఏండ్ల కుర్రాడు లమీన్ యమాల్ 21వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరు సమం చేశాడు. యమాల్ కొట్టిన ఈ గోల్‌తో అతడు ఈ టోర్నీలో అత్యంత పిన్నవయసులో గోల్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులకెక్కాడు. అదే ఊపులో స్పెయిన్‌కు 25వ నిమిషంలో డానీ ఒల్మో గోల్ చేశాడు. ఆ తర్వాత ఫ్రాన్స్ ఎంత ప్రయత్నించినా స్పెయిన్ గోల్ చేసే అవకాశమివ్వలేదు. నెదర్లాండ్స్-ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీస్‌లో విజేతతో స్పెయిన్ టైటిల్ పోరులో తలపడనుంది.

కోపా అమెరికా ఫైనల్‌లో అర్జెంటీనా

యూరో కప్‌తో సమాంతరంగా జరుగుతున్న కోపా అమెరికా టోర్నీలో అర్జెంటీనా ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో అర్జెంటీనా 2-0తో కెనడాను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆ జట్టు తరపున జులియన్ (22వ నిమిషంలో), లియోనల్ మెస్సీ (51వ నిమిషంలో) తలా ఓ గోల్ చేశారు.

'నాకు అంత వద్దు'

2.5 కోట్లు సరిపోతాయన్న ద్రవిడ్

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్ సాధించిన భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్ తన గౌరవాన్ని మరింత పెంచుకున్నాడు. టీమ్ ఇండియా విశ్వవిజేతగా నిలువడంలో కీలకంగా వ్యవహరించిన ద్రవిడ్‌కు ప్లేయర్లతో సమానంగా బీసీసీఐ 5కోట్ల నజరానా ప్రకటించింది. అయితే దీన్ని ఈ క్రికెట్ దిగ్గజం సున్నితంగా తిరస్కరించాడు. కోచింగ్ బృందంలో అందరికి ఇచ్చినట్లే తనకు 2.5కోట్లు ఇవ్వండని, ఎక్కువ వద్దంటూ ద్రవిడ్ స్పష్టం చేశాడు. వాస్తవానికి వన్డే ప్రపంచకప్‌తో ద్రవిడ్ గడువు ముగిసినా..టీ20 వరల్డ్‌కప్ వరకు బీసీసీఐ తీసుకున్న నిర్ణయం కలిసి వచ్చింది.

అట్కిన్సన్ అదుర్స్

ఏడు వికెట్లతో విజృంభణ

లార్డ్స్: ప్రఖ్యాత లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో బుధవారం నుంచి మొదలైన తొలి టెస్టులో మొదటి రోజు ఇంగ్లండ్ సంపూర్ణ ఆధిక్యం ప్రదర్శించింది. తన కెరీర్‌లో తొలి టెస్టు ఆడుతున్న ఇంగ్లీష్ పేసర్ గస్ అట్కిన్సన్ (7/45) ఏడు వికెట్లతో విజృంభించడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ 41.4 ఓవర్లలో 121 పరుగులకే ఆలౌట్ అయింది. మికైల్ లూయిస్ (27) టాప్‌స్కోరర్. అట్కిన్సన్.. 35వ ఓవర్లో 3 వికెట్లు తీసి వెస్టిండీస్‌ను కోలుకోని దెబ్బకొట్టాడు. 'వీడ్కోలు టెస్టు'లో పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ ఒక వికెట్ పడగొట్టాడు. రెండో సెషనల్‌లోనే బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్ 38 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. జాక్ క్రాలే (76), ఓలీ పోప్ (57) రాణించారు.

భారత్ ఆల్‌రౌండ్ షో

రాణించిన గిల్, సుందర్ • టీమ్‌ఇండియాకు రెండో విజయం

2-1తో సిరీస్‌లో ముందంజ

జింబాబ్వే పర్యటనలో యువ భారత్ జోరు కొనసాగిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఓడినా తర్వాత అనూహ్యంగా పుంజుకున్న టీమ్‌ఇండియా.. హరారే వేదికగా ఆతిథ్య జట్టుతో జరిగిన మూడో టీ20లో బ్యాట్‌తో పాటు బంతితోనూ రాణించి వరుసగా రెండో విజయాన్ని కైవసం చేసుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అర్ధసెంచరీతో రాణించగా రుతురాజ్ గైక్వాడ్ తృటిలో ఫిఫ్టీ మిస్ అయ్యాడు. బౌలర్లలో వాషింగ్టన్ సుందర్, అవేశ్ ఖాన్ రాణించడంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజ వేసింది.

గిల్ (66)

సుందర్ (3/15)

హరారే: యువ భారత్ మరోసారి అదరగొట్టింది. జింబాబ్వే పర్యటనలో ఉన్న కుర్రాళ్లు ఆతిథ్య జట్టుతో జరిగిన మూడో టీ20లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యర్థిపై 23 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. కెప్టెన్ గిల్ (49 బంతుల్లో 66, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 49, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), యశస్వీ జైస్వాల్ (27 బంతుల్లో 36, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. అనంతరం ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులకు పరిమితమైంది. డియోన్ మేయర్స్ (49 బంతుల్లో 65 నాటౌట్, 7 ఫోర్లు, 1 సిక్స్), క్లైవ్ మడాండే (26 బంతుల్లో 37, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. ఛేదనలో జింబాబ్వేను కట్టడి చేసిన వాషింగ్టన్ సుందర్ (3/15)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆది నుంచే దంచుడు:

తుది జట్టులో 4 మార్పులతో బరిలోకి దిగిన భారత్ ఈ మ్యాచ్‌లో ఏకంగా నలుగురు ఓపెనర్లతో బరిలోకి దిగింది. గిల్‌కు జతగా జైస్వాల్ రాకతో అభిషేక్ శర్మ మూడో స్థానానికి వెళ్లగా రుతురాజ్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ నలుగురూ ఐపీఎల్‌లో ఓపెనర్లే కావడం గమనార్హం. తొలి ఓవర్లోనే జైస్వాల్ 4, 4, 6 బాదగా రెండో ఓవర్లో గిల్ సైతం 4, 6, 4తో ఇన్నింగ్స్‌ను వేగంగా మొదలుపెట్టాడు. 5 ఓవర్లకే 54 పరుగులు చేసిన భారత్ ఆ తర్వాత నెమ్మదించింది. జింబాబ్వే సారథి సికందర్ రజా వేసిన 9వ ఓవర్లో మొదటి బంతిని రివర్స్ స్వీప్ చేయబోయిన జైస్వాల్ పాయింట్ వద్ద బెన్నెట్‌కు చిక్కాడు. గత మ్యాచ్‌లో శతకగర్జన చేసిన అభిషేక్ (10) ఈ మ్యాచ్‌లో ఆ మ్యాజిక్‌ను కొనసాగించలేకపోయాడు. ఈ క్రమంలో రుతురాజ్‌తో జతకలిసిన గిల్ భారత స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. చటారా 13వ ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించి అర్ధ సెంచరీ పూర్తిచేసిన గిల్ ఆ తర్వాత గేర్ మార్చాడు. గైక్వాడ్ సైతం ధాటిగా ఆడాడు. మూడో వికెట్‌కు 72 పరుగులు జోడించిన ఈ జోడీని 17వ ఓవర్లో ముజరబని విడదీశాడు. గిల్ నిష్క్రమించాక ఎంగ్వారా 19వ ఓవర్లో రెండు ఓవర్లో 6, 4 బాదిన గైక్వాడ్ వ్యక్తిగత స్కోరు 49 పరుగుల వద్ద భారీ షాట్ ఆడబోయి పెవిలియన్ చేరాడు.

ఆ ఇద్దరు తప్ప..:

భారీ ఛేదనలో జింబాబ్వేకు ఆదిలోనే భారీ షాకులు తాకాయి. అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, వాషింగ్టన్ సుందర్ ధాటికి జింబాబ్వే 7 ఓవర్లకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. టాపార్డర్ విఫలమైనా మేయర్స్, మడాండే భారత బౌలర్లకు అడ్డునిలిచారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 77 పరుగులు జోడించారు. అయితే ఖలీల్ అహ్మద్ (1/15), సుందర్ కట్టడి చేయడంతో జింబాబ్వే వేగంగా పరుగులు సాధించలేకపోయింది. ఆఖర్లో మసకద్జ (18 నాటౌట్) మెరుపులు ఆ జట్టును గెలిపించలేకపోయాయి.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 182/4 (గిల్ 66, రుతురాజ్ 49, రజా 2/24, ముజరబని 2/25). **జింబాబ్వే:** 20 ఓవర్లలో 159/6 (మేయర్స్ 65 నాటౌట్, మడాండే 37, సుందర్ 3/15, అవేశ్ 2/39)

2 టీ20లలో భారత్‌పై 150+ స్కోరు చేయడం జింబాబ్వేకు ఇది రెండోసారి మాత్రమే. 2016లో ఒకసారి 170/6 చేసింది.

కోచింగ్ సిబ్బందిపై కసరత్తు

అసిస్టెంట్ కోచ్‌గా అభిషేక్ నాయర్?

ముంబై: భారత క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా నియమితుడైన గంభీర్ తన సహాయక సిబ్బంది ఎంపికపై కసరత్తులు చేస్తున్నాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌తో తనతో పాటు పనిచేసిన అభిషేక్ నాయర్.. గంభీర్‌కు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నట్టు సమాచారం. నాయర్‌కు గంభీర్‌తో పాటు సారథి రోహిత్‌తోనూ సన్నిహిత సంబంధాలుండటంతో అతడి నియామకం దాదాపుగా ఖరారైనట్టేనని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ఫీల్డింగ్ కోచ్‌గా జాంటీ రోడ్స్ పేరు వినిపించినా దిలీప్‌నే కొనసాగించాలని గంభీర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. బౌలింగ్ కోచ్‌గా జహీర్ వైపు బోర్డు మొగ్గు చూపిస్తున్నట్టు వినికిడి.

సెమీస్‌కు జొకో

గాయంతో వైదొలిగిన అలెక్స్ డి మినార్ • రిబాకినాతో క్రెజికోవా ఢీ

లండన్: వింబుల్డన్ టోర్నీలో సెమీస్ బెర్తులు ఖాయమయ్యాయి. కెరీర్‌లో 25వ టైటిల్ వేటలో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఈ టోర్నీ సెమీస్‌కు ప్రవేశించాడు. క్వార్టర్స్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ డి మినార్‌తో తలపడాల్సి ఉన్నా గాయం కారణంగా అతడు తప్పుకోవడంతో రెండో సీడ్ జొకో ఫైనల్-4కు అర్హత సాధించాడు. తొలి సెమీస్ అల్కారజ్ (స్పెయిన్), డేనిల్ మెద్వెదెవ్ మధ్య జరుగనుంది. మహిళల విభాగంలో నాలుగో సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) 6-3, 6-2తో ఎలీనా స్విటోలినా (ఉక్రెయిన్)ను ఓడించి సెమీస్ చేరింది. మరో మ్యాచ్‌లో బర్బొర క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) 6-4, 7-6 ((7/4)తో జలెన ఒట్సొపెంకో(లాత్వియ)ను చిత్తుచేసి తొలిసారి వింబుల్డన్ సెమీస్ చేరింది. మొదటి సెమీస్‌లో క్రెజికొవా 2022లో టైటిల్ గెలిచిన రిబాకినాతో ఢీకొననుంది. రెండో సెమీస్ అన్‌సీడెడ్ డొన వెకిచ్ (క్రొయేషియా), జాస్మిన్ పలోని(ఇటలీ) మధ్య జరుగనుంది.



అస్తిత్వ పోరులో 'తంగలాన్'

తమిళ అగ్ర హీరో విక్రమ్ నటిస్తున్న మరో ప్రయోగాత్మక చిత్రం 'తంగలాన్'. పా.రంజిత్ దర్శకుడు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ కథానాయికలు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. బంగారం వేటలో రెండు తెగల మధ్య పోరుతో ఆరంభమైన ట్రైలర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా సాగింది. బ్రిటీష్ అధికారులు బంగారం వెలికితీత కోసం స్థానిక తెగల వారిని పనిలో పెట్టుకుంటారు. అందులో ఓ తెగ నాయకుడిగా విక్రమ్ కనిపించారు. తన వారి అస్తిత్వం కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడే నాయకుడిగా విక్రమ్ పాత్ర శక్తివంతంగా సాగింది. విల్లు, బరిసెలు, ఈటెలతో చేసిన యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలిచాయి. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్నాడు.

చిత్రం

చిట్టిగువ్వ పిట్టలాంటి చక్కనమ్మా..

రవితేజ కథానాయకుడిగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. బుధవారం ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాటను సాహితీ రచించారు. 'చిట్టిగువ్వ పిట్టలాంటి చక్కనమ్మా..బొట్టు పెట్టి పట్టుచీర కట్టుకోమ్మ జట్టుకట్టి చుట్టమల్లె చుట్టుకోమ్మా..' అంటూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. కశ్మీర్ నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తనదైన శైలి వినోదంతో దర్శకుడు హరీష్‌శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆయనంక బోస్, రచన-దర్శకత్వం: హరీష్ శంకర్.

శౌర్యానికి ప్రతీక కన్నప్ప

శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా విష్ణు మంచు రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఆయన టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో కన్నప్ప వాడిన విల్లుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ఆ పాత్రధారి మంచు విష్ణు తెలిపారు. తండ్రీకొడుకుల మధ్య బంధానికి, ధైర్యానికి ప్రతీక ఈ ధనుస్సు అని ఆయన చెప్పారు. 'కేవలం ఐదేళ్ల వయసులోనే కన్నప్ప అడవిలో క్రూరమైన పులిని ఎదుర్కొంటాడు. అంత చిన్న వయసులో తన కుమారుడి ధైర్యసాహసాలు చూసిన తండ్రి నాథనాథుడు ఎంతగానో సంతోషపడతాడు. కన్నప్ప శౌర్యానికి ప్రతీకగా పులి ఎముకలు, దంతాలతో విల్లును తయారుచేసి ఇస్తాడు. ఈ కథ గురించి న్యూజిలాండ్‌లోని కళా దర్శకుడు క్రిస్‌కు వివరించగా ఆయన ఆయన ప్రత్యేకంగా ఈ విల్లును రూపొందించాడు' అని మంచు విష్ణు తెలిపారు.

పగతో రగిలే 'రాయన్'

అతనో సాధారణ వ్యక్తి. మద్రాస్‌లోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తుంటాడు. కానీ అతని గతం మాత్రం పగతో రగిలిపోతుంటుంది. ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం ఎదురుచూస్తుంటాడు. ఇంతకీ ఆ వ్యక్తి ప్రతీకారం ఎవరి మీద? పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ అయిన అతను హోటల్‌లో చెఫ్‌గా ఎందుకు పనిచేయాల్సి వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే 'రాయన్' సినిమా చూడాల్సిందే అని చెబుతోంది చిత్ర బృందం. తమిళ అగ్ర హీరో ధనుష్ నటిస్తున్న 50వ చిత్రమిది. ఆయనే దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ ఇతర ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగులో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నది.

పీరియాడిక్ స్టోరీ 'క'

యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ చిత్రానికి 'క' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిదని, చిత్రీకరణ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.

సైకో కిల్లర్ వేటలో..

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ కథానాయిక. ఆగస్ట్ 2న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ట్రైలర్‌ను హీరో విశ్వక్‌సేన్ విడుదల చేశారు. సీరియల్ కిల్లర్‌ను పట్టుకునేందుకు చేపట్టే ఆపరేషన్ నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మన ఆలోచనలే మన వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయనే ఇంట్రస్టింగ్ పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించానని, మంచి ఆలోచనలు ఉన్న రాముడు దేవుడైతే, చెడు ఆలోచనలు కలిగిన రావణుడు రాక్షసుడయ్యాడనే ఫిలాసఫీతో ఈ సినిమా ఆకట్టుకుంటుందని దర్శకుడు వెంకట సత్య తెలిపారు. సైకో థ్రిల్లర్ కథాంశమిదని, ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుందని హీరో రక్షిత్ అట్లూరి పేర్కొన్నారు. ఈ సినిమాలో తాను జర్నలిస్ట్ పాత్రలో కనిపిస్తానని కథానాయిక సంగీర్తన విపిన్ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, రచన-దర్శకత్వం: వెంకట సత్య.

'పొలిమేర-3'కి సిద్ధం

'మా ఊరి పొలిమేర' 'పొలిమేర-2' చిత్రాలకు కొనసాగింపుగా 'పొలిమేర-3' తెరకెక్కనుంది. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, భోగేంద్రగుప్తా నిర్మించనున్నారు. త్వరలో ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలను ప్రారంభిస్తామని నిర్మాతలు తెలిపారు. సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల తదితరులు చిత్ర తారాగణం.

ఐదుగురు మిత్రుల కథ

రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. విస్కి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఈ నెల 19న విడుదలకానుంది. బుధవారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'తొమ్మిదేళ్ల క్రితం నా జీవితంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నా. ఎం.ఎస్. చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు మిత్రుల నేపథ్యంలో కథ నడుస్తుంది. కామెడీ డ్రామాగా ఆకట్టుకుంటుంది' అన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.